సమస్యలతో సతమతం

- లేపాక్షి జూనియర్ కాలేజీలో మౌలిక వసతులు కరువు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



లేపాక్షిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల



కళాశాల వెనుక ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

లేపాక్షి: మండల కేంద్రంలోని జూనియర్ కాలేజీలో సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారు. గ్రామీణా ప్రాంతాల నుంచి కాలేజీకి వచ్చే విద్యార్థులకు మౌలిక వసతులు లేక నానా అవస్థలు పడుతున్నారు. కనీస మరుగుదొడ్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

120 మంది విద్యార్థులు

లేపాక్షి జూనియర్ కాలేజీలో 120 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే ఒకే ట్యాప్ కనెక్షన్ ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజన సమయంలో వారి బాధలు అన్నీ ఇన్నీ కావు. దీనికితోడు తాగడానికి పగలంతా కేవలం మూడు వాటర్ క్యాన్లు మాత్రమే పెడుతున్నారని, క్యాన్లలో నీరు పూర్తయితే తాగునీరు లేక అవస్థ పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా బాలికలకు మరుగుదొడ్లు వున్నప్పటికీ అక్కడ పరిశుభ్రం లేకపోవడం, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో ఆందోళన చెందుతున్నారు. బాలురకు అసలు మరుగుదొడ్లు లేకపోవడం, విశ్రాంతి సమయంలో కళాశాలకు దూరంగా ఉన్న ప్రాంతానికి వెళ్లి మూత్ర విసర్జన చేయాల్సిన దుస్థితి నెలకొంది. కళాశాల వెనుక భాగంలో పిచ్చి మొక్కలు పెరిగి తరగతి గదుల్లోని కిటికిలు, వాకిళ్లలోకి రావడంతో అందులో నుంచి విష పురుగురులు వస్తున్నాయి. ముఖ్యంగా బైపీసీ విద్యార్థులకు అధ్యాపకుడు లేక వారు చదువులో ముందుకెళ్లలేకపోతున్నారు. అధ్యాపకుడే లేకపోతే పరీక్షలు రాయడం ఎలా సాధ్యం అవుతుందని విద్యార్థులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కళాశాలలో కనీస వసతులు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అధ్యాపకుడు లేకపోతే ఎలా?



కళాశాలలో ఇంటర్ బైపీసీ గ్రూపు చదువుతున్న విద్యార్థులకు ఏడు నెలలుగా ఫిజిక్స్ అధ్యాపకుడు లేరు. దీంతో పరీక్షలు ఎలా రాయాలో దిక్కుతోచడం లేదు. మొదటిలో నెల రోజులు మాత్రం ఫిజిక్స్ అధ్యాపకుడు బోధించారు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకూ అధ్యాపకుడు లేకపోవడంతో పరీక్షల్లో ఎలా పాసు కావాలో కూడా అర్థం కావడం లేదు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ దృష్టికి తీసికెళ్లాము.

– అఫ్రీద్, విద్యార్థి

విష పురుగులు వస్తున్నాయి



కళాశాలలో తరగతి గదులు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. మరుగుదొడ్లు, కళాశాల వెనుక, ముందర గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో విష పురుగులు వస్తున్నాయి. దీంతో విద్యార్థులందరూ ఆందోళనకు గురి కావాల్సిన పరిస్థితి నెలకొంది. కళాశాల ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి.

– నందీష్, విద్యార్థి

రూ.10 వేలకు ఎవరూ రావడం లేదు

కళాశాలలో బైపీసీ విద్యార్థులకు ఫిజిక్స్ బోధించడానికి కాంట్రాక్ట్ పద్ధతి కింద అధ్యాపకులను ఆహ్వానించాము. నెలకు రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తామని ప్రకటించాము. అయితే రూ.10 జీతానికి బోధించడానికి ఎవరు రావడం లేదు. పరీక్షలు దగ్గరగా ఉండడంతో విద్యార్థులు పరీక్షలు రాయడానికి ఇబ్బంది పడుతున్నారు.

– ఎస్ఎం. బాషా,
ప్రిన్సిపాల్, జూ.కాలేజీ, లేపాక్షి

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్టాపన



అకుమల స్వామి విగ్రహం



అలంకరణలో శివయ్య



ఉత్సవాల్లో పాల్గొన్న హనుమంతనాథ స్వామీజీ

పావగడ: తాలూకాలోని నిడిగల్ హోబళి ఆర్లహళ్లి గ్రామంలో వెలసిన మోపిటోళ్ల గోత్రానికి చెందిన యాదవుల ఆరాధ్య దైవం అకుమల మాధవరాజుల స్వామి నూతన దేవాలయం, నూతన విగ్రహ ప్రతిష్టను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచే యంత్ర ప్రతిష్టాపన, మహా పూర్ణాహుతి, కూష్మాండబలి, నూతన విగ్రహాల మహాభిషేకం తదితర పూజలు చేశారు. మాజీ మంత్రి వెంకటరమణప్ప ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

పరిగి: మండలంలోని శాసనకోటలో నూతనంగా నిర్మించిన శివాలయంలో ఈశ్వర, శివలింగ ప్రతిష్టాపన కార్యక్రమం సోమవారం వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా చేపట్టిన పూజ కార్యక్రమాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమాలను నిర్వహించారు. చివరి రోజు చేపట్టిన కార్యక్రమంలో శివలింగం, మూలవిరాట్‌తో పాటూ కలశ గోపుర ప్రతిష్టను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మండల కన్వీనర్ నరసింహమూర్తి, సర్పంచ్ మాలతి, నరసింహారెడ్డి, ఎంపీటీసీ మారుతీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్ : మండల పరిధిలోని క్యాంపురం గ్రామంలో కుంచిటి వక్కలిగ ఎరుడుకెరె భక్తులు నూతనంగా నిర్మించిన శంకలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్థిర విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా జరిగింది. ఎలెరాంపురం నరసింహగిరి క్షేత్ర కుంచిటిగ మహా సంస్థాన మఠం హనుమంతనాథ స్వామిజీ పాల్గొని స్థిర ప్రతిష్టాపన విగ్రహాలకు పూజలు చేశారు. కార్యక్రమంలో రొళ్ల జెడ్పీటీసీ అనంతరాజు, సర్పంచ్ కరియన్న, కుంచిటిగ వక్కలిగ కులస్తులు పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్యపై రైతుల ధర్నా



హెచ్‌డీ హళ్లి సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

అగళి: లో ఓల్టేజ్ సమస్య పరిష్కరించాలంటూ అగళి మండల పరిధిలోని హెచ్‌డీ హళ్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట సోమవారం రైతులు ధర్నా చేపట్టారు. నెలరోజులుగా నాణ్యమైన విద్యుత్ సరఫరా కావడం లేదని, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేద సర్పంచ్ రామకృష్ణప్ప, మాజీ ఎంపీపీ రామకృష్ణప్ప, రైతులు నరసింహరాజు, కుమార్, మంజునాథ, శివన్న,దేవరాజు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోకపోతే రైతులందరూ కలసి ఉద్యమిస్తామన్నారు. ట్రాన్స్‌కో ఏడీ రాజు మాట్లాడుతూ సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

సమస్యలు పరిష్కరించండి

మడకశిర: మడకశిరలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో రొళ్ల వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అనంతరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ప్రధానంగా రైతులు సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని, కృష్ణా జలాలు అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రొళ్ల మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వలసలో జలధి ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా జలధి ఉత్సవం

అమరాపురం: మండలంలోని వలస గ్రామంలో భక్తులు భూతరాయస్వామి, గౌడచంద్రమ్మ, కరియమ్మ దేవతలకు సోమవారం జలధి ఉత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఉత్సవ విగ్రహాలను డప్పు వాయిద్యాలతో గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా సమీప వంక వద్దకు తీసుకెళ్లారు. అక్కడ స్వామివార్లను కూర్చొబెట్టి గంగా జలంతో శుద్ధి చేసి అనంతరం వివిధ రకాల పూజలు చేశారు. భక్తులు తెచ్చిన వివిధ పూలతో అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు.

అలంకరణలో భూతరాయస్వామి



మా భూమి మాకు ఇప్పించండయ్యా..

పెనుకొండ రూరల్: తమ తాతలకు చెందిన భూమిని కొందరు అక్రమించారని తమ భూమని తమకు దక్కేలా చూడాలంటూ బాధితులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. బాధితులు అన్నప్ప కుటుంబ సభ్యుల వివరాల మేరకు... మండలంలోని గుట్టూరులోని సర్వే నంబర్ 198–5లో 1–99 సెంట్లు, 198–2లో ఎకరం భూమి తమ ముత్తాత పెద్ద సుబ్బన్న పేరు మీరు మీద ఉండేదన్నారు. ఇటీవల గ్రామానికి చెందిన కొందరు అక్రమంగా 1బీలు పొంది భూమి ఆక్రమించారన్నారు. అక్రమ 1బీని రద్దు చేసి న్యాయం చేయాలని బాధితుడు అన్నప్ప కుటుంబ సభ్యులతో కలసి తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

వీఆర్‌ఓల నిరవధిక సమ్మె



సమ్మె చేస్తున్న వీఆర్వోలు

పావగడ: తమ సమస్యలు పరిష్కరించాలంటూ వీఆర్‌ఓలు స్థానిక తాలూకి కార్యాలయం దగ్గర సోమవారం నిరవధిక సమ్మె చేపట్టారు. గ్రామ పాలనాధికారుల సంఘం అధ్యక్షుడు రాజేశ్ మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేవరకూ ఆందోళన సాగిస్తామన్నారు.

'ఆల్బెండజోల్'తో సంపూర్ణ ఆరోగ్యం



మడకశిర మండలం బుళ్లసముద్రంలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న మంజువాణి

సాక్షిబృందం: ఆల్బెండజోల్‌తోనే విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి అన్నారు. సోమవారం మడకశిర మండలం బుళ్లసముద్రం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ అందించారు. హిందూపురం, పెనుకొండ, మడకశి నియోజకవర్గాల్లోని పలు పాఠశాలల్లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ జరిగింది.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



గంగులమ్మకు ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

హిందూపురం అర్బన్: చిలమత్తూరు మండలం చాగలేరు పంచాయతీలోని శ్యానగానపల్లికి చెందిన మాజీ సర్పంచ్ వెంకటరామప్ప అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక... ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, నాయకుల ద్వారా బాధిత కుటుంబానికి రూ.18 వేలు ఆర్థిక సాయం అందేలా చేశారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు లక్ష్మీపతిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, చౌడిరెడ్డి, అశ్వర్థప్ప, ఆదినారాయణరెడ్డి, బలాపురం వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

పరిగి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం సూచించారు. సోమవారం మండలంలోని ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్ పాఠశాల, పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

పావగడ: పట్టణంలోని మహాత్మ గాంధీ క్రీడా మైదానంలో స్థానిక న్యూ అంజన్ క్రీడా యువక సంఘం నేతృత్వంలో మూడు రోజులుగా జరుగుతున్న పావగడ సూపర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. ఫైనల్స్‌లో వదనకల్లు జట్టుపై లెవెన్ హంటర్స్ జట్టు విజయం సాధించి ట్రోఫీ కైవసం చేసుకుంది.

కియా కార్మికులకు అవగాహన

పెనుకొండ రూరల్: కియా అనుబంధ పరిశ్రమల వద్ద సీఐటీయూ నాయకులు సోమవారం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్మికులకు అందాల్సిన వేతన, సదుపాయాలపై అవగాహన కల్పించారు. 2022–23కు సంబంధించి రూ.1350 కోట్ల పన్నును నేటికీ కియా.. ప్రభుత్వానికి చెల్లించలేదన్నారు. ఉద్యోగులకు సరైన వేతనాలు కూడా ఇవ్వడం లేదన్నారు. నాయకులు రమేష్, బాబావలి, తిప్పన్న, పెడబల్లి బాబా, రమణ, రఫీ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు తీసుకోవాలి

పెనుకొండ: పట్టణ పరిధిలో అనుమతులు పొందిన తర్వాత ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలని టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ చంద్రశేఖర్ ప్రజలకు సూచించారు. పట్టణంలోని ప్రెస్ కాలనీలో పలువురు అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. పనులు నిలుపుదల చేయించి అనుమతులు పొందిన తర్వాత నిర్మాణాలు చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ సరఫరా వేళల మార్పు

లేపాక్షి: మండలంలోని పులమతి, పి.సడ్లపల్లి, పి.బసవనపల్లి గ్రామాలలో ఉన్న వ్యవసాయ బోరుబావులకు సరఫరా చేసే విద్యుత్ వేళల్లో మార్పు చేస్తున్నట్లు ఏఈ వెంకటేశులు తెలిపారు. మంగళవారం నుంచి రోజూ ఉదయం 3 గంటల నుంచి 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

గోరంట్ల: స్థానిక ఎస్‌పీఏస్ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం పేస్ వెల్ఫేర్ సొసైటీ పుట్టపర్తి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి జబ్బులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

వృద్ధులకు వైద్య చికిత్సలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొంది గ్రామంలోని వెంకటేశ్వర వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సోమవారం తుమకూరుకు చెందిన ప్రైవేట్ ఆస్పత్రి వైద్యుల బృందం సభ్యులు వైద్య చికిత్సలు అందించారు. మందులు అందించి పలు ఆరోగ్య సూత్రాలను వివరించారు. డాక్టర్ శేఖర్, ఆశ్రమ నిర్వాహకులు తిమ్మారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోండి

మడకశిర: ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య సూచించారు. మడకశిరలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సంకల్ప్ కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసుకున్న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు సోమవారం డీఆర్‌డీఏ పీడీ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.

వీరభద్రుడి సేవలో డిప్యూటీ సీఈఓ



డిప్యూటీ సీఈఓకు మెమొంటో అందిస్తున్న దృశ్యం

లేపాక్షి: మండల కేంద్రంలోని వీరభద్ర స్వామి దేవాలయాన్ని అనంతపురం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య సోమవారం సాయంత్రం వీరభద్రస్వామిని దర్శించుకున్నారు. ఎంపీడీఓ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ జయచంద్రనాయక్, గోవిందరాజు, లేపాక్షి పంచాయితీ కార్యదర్శి రమేష్‌లు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు.

13 నుంచి పింఛన్ల పునఃపరిశీలన

హిందూపురం అర్బన్ : మండల వ్యాప్తంగా మంచానికే పరిమితమైన 51 మంది పింఛన్లను పునఃపరిశీలించేందుకు ఈ నెల 13,14 తేదీల్లో జిల్లా వైద్య బృందం పరిశీలించనున్నట్లు ఎంపీడీఓ శివకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. వారు వచ్చే సమయంలో అందుబాటులో ఉండి సదరం సర్టిఫికెట్లు చూపాలన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నాయకులకు పరామర్శ



శ్రీరంగరాజుపల్లిలో ఆదినారాయణరెడ్డిని పరామర్శిస్తున్న చరణ్‌రెడ్డి

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు వడ్డే నాగరాజు, ఆదినారాయణరెడ్డిని సోమవారం వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. అలాగే పైడేటికి చెందిన మైనార్టీ నాయకుడు అంజాద్‌బాషా సోదరి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట ఎంపీపీ సవిత, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి ప్రభాకర్, మండల కన్వీనర్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

13న జాబ్‌మేళా

గోరంట్ల: స్థానిక ఎస్‌పీఎస్ జూనియర్ కళాశాలలో ఈనెల 13న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఏఎన్‌కే డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏఎన్‌కే డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కెంపుల లక్ష్మీనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు.

రైతులకు ఆర్థిక సాయం



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర: నియోజకవర్గంలో అడవి జంతువుల వలన నష్టపోయిన బాధిత రైతులకు సోమవారం మడకశిరలో కలెక్టర్ చేతన్, జేసీ అభిషేక్‌కుమార్, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు చెక్కుల రూపంలో నష్టపరిహారాన్ని అందించారు. గుణేమోరుబాగల్ రంగనాథ్‌కు రూ.12 వేలు, కల్లుమర్రి నారాయణకు రూ.6 వేలు, గుడిబండ మండలం మద్దనకుంటకు చెందిన తిమ్మప్పకు రూ.10 వేల చొప్పున పరిహారం చెక్కులను అందించారు.

సీసీ రోడ్డు ప్రారంభం

అమరాపురం: మండలంలోని హేమావతి గ్రామంలో నూతనంగా వేసిన సీసీ రోడ్డును మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సోమవారం ప్రారంభించారు. సచివాలయం నుంచి గొల్లహట్టి వెనుక భాగంలో రూ.పది లక్షలతో సీసీ రోడ్డును నిర్మించారు.

అబాకస్ పోటీలకు ఎంపిక



జయతేజ్‌కు ప్రశంసాపత్రం అందిస్తున్న దృశ్యం

పెనుకొండ: పట్టణంలోని బ్రిలియన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన జయతేజ్ జాతీయ స్థాయి అబాకస్ పోటీలకు ఎంపికయ్యాడు. విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో విజయవాడలో ఆదివారం నిర్వహించిన అబాకస్ పోటీల్లో నాల్గవ తరగతి విద్యార్థి అయిన జయతేజ్‌కి ద్వితీయ బహుమతి దక్కింది. దీంతో జాతీయ స్థాయి అబాకస్ లెవెల్ 3 పోటీలకు ఎంపికయ్యాడు. విశ్వం ఎడ్యుటెక్ నిర్వాహకులు విజయవాడలో కప్, ప్రశంసాపత్రం అందజేశారు. విద్యార్థికి స్థానిక పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

శ్రీగంధం తోట దగ్ధం



రొళ్ల: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో రొళ్ల మండలం తిరుమలదేవరపల్లి వద్ద ఉన్న శ్రీగంధం తోట కాలిపోయింది. గ్రామానికి చెందిన రైతు టి.తిప్పేస్వామి తనకున్న 5.5 ఎకరాల్లో నుంచి 1.5 ఎకరాల్లో వక్క, 2.5 ఎకరాల్లో శ్రీగంధం మొక్కలను మూడేళ్ల క్రితం నాటారు. శ్రీగంధం తోట సాగు చేసిన పొలానికి అనుకుని ఉన్న రిజర్వు ఫారెస్ట్‌లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేశారు. దీంతో మంటలు చెలరేగి శ్రీగంధం తోటను చుట్టుముట్టాయి. దాదాపు రెండు ఎకరాల్లో 300 చెట్లతో పాటు 700 మీటర్లకు పైగా డ్రిప్పు పరికరాలు కాలి పోయాయి. ఘటనతోరూ.1.5 లక్షల మేర నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయాడు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

గుడిబండ: మండల పరిధిలోని రాళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ, మహిళ శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై సీడీపీఓ శాంతలక్ష్మీ బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల కలిగే నష్టాలను వారికి వివరించారు. బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు.

13న ఆంజనేయస్వామి వార్షికోత్సవం



వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపికకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని మేళాపురం దండురోడ్డులోని 27 అడుగుల ఏకశిల ఆంజనేయస్వామి విగ్రహం స్థాపించి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈనెల 13న మొదటి వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రత్యేక పూజలకు హాజరుకావాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్.దీపిక, వేణురెడ్డి దంపతులకు ఆహ్వాన పత్రికను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కురుబ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్, వార్డు కౌన్సిలర్ ఎస్‌పి.శివ, కౌన్సిలర్ మహేష్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు నారాయణస్వామి, గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రొద్దం: మండలంలోని చెరుకూరు పెన్నానది పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇసుక తరలిస్తూ పట్టుబడిన ట్రాక్టర్లను సోమవారం తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

నేడు జ్యోతుల ఉత్సవం



అలంకరణలో రత్నగిరి కొల్లాపురమ్మ

అగళి: మండల పరిధిలోని నరసబుందిలో సోమవారం సాయంత్రం నుంచి రత్నగిరి కొల్లాపురమ్మ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు ఈ ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నామని గ్రామ పెద్దలు తెలిపారు. రత్నగిరిలో వెలసిన కొల్లాపురి మహాలక్ష్మి అమ్మవారిని మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చారు. నరసబుంది గ్రామంలో పట్టం కూర్చొబెట్టి పూజలు చేశారు. మంగళవారం అమ్మవారికి మహిళలు భక్తి శ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం నిర్వహించనున్నారు.

స్వీపర్లకు జీతాలు చెల్లించండి

హిందూపురం టౌన్: మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న కంటెన్జెంట్ స్వీపర్లకు జీతాలు చెల్లించాలని ఏపీఎంటీఎఫ్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ రమేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సోమవారం ఎంజీఎం పాఠశాలకు విచ్చేసిన మున్సిపల్ చైర్మన్‌కు ఉపాధ్యాయులు సమస్యలను తెలియజేశారు. ఏపీఎంటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ హిందూపురం పురపాలక సంఘం పరిధిలో 20 మంది స్వీపర్లు పనిచేస్తున్నారని, 8 నెలల నుంచి జీతాలు అందలేక అవస్థలు పడుతున్నారన్నారు.